క్లుప్తంగా

వలంటీర్ నియామకాలకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు

మునగపాక : వలంటీర్ నియామకాల్లో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. దరఖాస్తు చేసుకున్న వారిని ఎంపీడీవో పి.రవికుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్ ఆధ్వర్యంలో పలు అంశాలపై ఇంటర్వ్యూ చేశారు. మొత్తం ఐదు పోస్టులకు సంబంధించి 8 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరైనట్టు ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. ఎంపిక వివరాలను గురువారం వెల్లడిస్తామన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక రేపు

కోటవురట్ల : ఈ నెల 31న సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించనున్నట్టు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో 2021–22 ఆర్థిక సంవత్సరంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించిన ఈజీఎస్, సెర్ప్, హౌసింగ్, పీఆర్, వెటర్నరీ, ఆర్‌డబ్ల్యూఎస్, సర్వ శిక్షా అభియాన్ విభాగాలలో పనులు, నిధుల వినియోగంపై సామాజిక తనిఖీ పూర్తయిందన్నారు. సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలపై మండల పరిషత్ ఆవరణలో ఉదయం 10 గంటల నుంచి ప్రజా వేదిక జరగనున్నట్టు పేర్కొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన సదస్సు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని దుప్పుతూరు, తిమ్మరాజుపేట గ్రామాల్లో విజయ వాహిని చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పోషకాహార పక్షోత్సవాలు నిర్వహించారు. దీనిలో భాగంగా బుధవారం చిరుధాన్యాల ప్రాధాన్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. పోషక విలువలుండే చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని ఈ నిర్వాహకులు స్థానికులకు సూచించారు. బాలింతలు, గర్భిణుల్లో పోషకాహార లేమికి చిరుధాన్యాలతో చెక్ పెట్టవచ్చన్నారు.

డీలర్లకు ఎరువుల కేటాయింపు



రాజ్‌కమల్, ఏడీ, వ్యవసాయశాఖ

పాయకరావుపేట : వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని మండలాల్లో ఎరువుల డీలర్లకు ఖరీఫ్ పంటల ఎరువులు కేటాయింపు చేపట్టనున్నట్టు వ్యవసాయ శాఖ ఏడీ టి.ఎస్. రాజ్‌కమల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం డీలర్ల వద్ద వున్న ఎరువుల నిల్వలు, అమ్మకాల రికార్డులను తనిఖీ చేయనున్నట్టు తెలిపారు. రికార్డుల్లో తేడాలు వుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేజీబీవీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోటవురట్ల : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎస్‌వో సరితాదేవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికిగాను ఆరో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పేర్కొన్నారు. ఏప్రిల్ 20లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. బడి మానేసిన పిల్లలు, అనాథలు, బడి బయట పిల్లలు, పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పిల్లలు ప్రవేశాలకు అర్హులుగా పేర్కొన్నారు.

'ఆధార్ అప్‌డేట్ చేసుకోండి'



వాడ్రాపల్లిలో ఆధార్ శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

మునగపాక : ఆధార్ కార్డు అప్‌డేట్ శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పి.రవికుమార్ కోరారు. మండలంలోని వాడ్రాపల్లి సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ అప్‌డేట్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని, తమ ఆధార్ కార్డుల్ని అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఈవోఆర్డీ ఈశ్వరరావు ఉన్నారు.

సీతారాముల కల్యాణం చూతము రారండి

'రామో విగ్రహవాన్ ధర్మః'.. రాముడు వేసే ప్రతి అడుగూ, ప్రతి కదలికా.. సత్యం, ధర్మం కూడినవే. ధర్మ బద్ధ జీవనానికి నిలువెత్తురూపం శ్రీరామచంద్రుడు. ఈ భూమిపై మనిషి ఎలా బ్రతకాలో.. జీవించి చెప్పిన పురుషోత్తముడాయన. అందుకే రాముడంటే కేవలం దేవుడు మాత్రమే కాదు.. భారతీయుల నరనరాన జీర్ణించుకున్న జీవన విధానం. శ్రీరాముడు త్రేతా యుగంలో జన్మించింది నవమినాడే. గురువారం శ్రీరామనవమి సందర్భంగా ఊరూవాడా రామనామ స్మరణతో మార్మోగనుంది. శ్రీరామ జననంతోపాటు, సీతారాముల కల్యాణం, శ్రీరామపట్టాభిషేక కార్యక్రమాలు అత్యంత వేడుకగా జరగనున్నాయి.

- ఊరూవాడా సీతారామ నామ స్మరణ
- అందంగా ముస్తాబైన రామాలయాలు
- కోలాటాలు, భజనలతో ఊరూరా సందడి



వేంపాడులో సీతారాముల సారె ఊరేగింపు

రాంబిల్లి : సీతారాముల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా దిమిలి సంతబయలు రామాలయంలో బుధవారం నిర్వహించిన చిన్నారుల భక్తిగీతాలాపన ఆకట్టుకుంది. కె.ఎస్. గాయత్రి టీచర్ చిన్నారుల బృందానికి భక్తి గీతాలు నేర్పించి వారిచే ప్రదర్శన నిర్వహించారు. చిన్నారుల్లో ఆధ్యాత్మికత పెంపొందించడంతోపాటు, సంగీతంపై అవగాహన కోసం ప్రత్యేక తర్ఫీదునిస్తున్నట్లు గాయత్రి తెలిపారు. కార్యక్రమంలో రామాలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని వేంపాడు, చినదొడ్డిగల్లు, దేవవరం, ఉద్దండపురం, నక్కపల్లి, డీఎల్ పురం, కాగిత, గొడిచర్ల తదితర గ్రామాల్లో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వేంపాడులో సీతారాముల సారెను గ్రామస్తులు ఘనంగా ఊరేగించారు. స్వామివారికి వివిధ రకాల పదార్థాలతో సారె సిద్ధం చేసి, మహిళల కోలాటాల మధ్య ఊరంతా తిప్పారు.

- చినదొడ్డిగల్లు, దేవవరం, ఉద్దండపురం గ్రామాల్లో కూడా కల్యాణ ఏర్పాట్లు ఘనంగా చేశారు. ఆలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి దర్శనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భజనలు, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఉత్సవ మూర్తులను గ్రామంలో ఊరేగించి అనంతరం కల్యాణం జరపనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.



రామాలయంలో పూజలు అందుకున్న సీతారాములు

పాయకరావుపేట: శ్రీరామనవమి సందర్భంగా రామాలయాలు రంగులతో సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. మండలంలోని రామాలయాలకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రంగులు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు దైవ దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశారు. అదే విధంగా సీతారామ కల్యాణంలో పాల్గొనే భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు, తాటాకు పందిళ్లు ఏర్పరిచారు.

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని అన్ని రామాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే పలు గ్రామాల్లో పెళ్లి రాట మహోత్సవాలు నిర్వహించగా, బుధవారం కొండకర్ల, మళ్లవరం తదితర గ్రామాల్లో శ్రీసీతారాముల పెళ్లికి సంబంధించిన రాట మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

మునగపాక : మండలంలోని వాడ్రాపల్లిలో బుధవారం సీతారాముల పెళ్లి రాట మహోత్సవం వేడుకగా నిర్వహించారు. శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా చినరామాలయం కమిటీ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో రాట వేశారు. ఈ వేడుకలో మళ్ల చిన్న, విల్లూరి సూరిబాబు, మళ్ల సంతోష్, కొయిలాడ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



పాయకరావుపేటలో ముస్తాబైన రామాలయం



వాడ్రాపల్లిలో సీతారాముల పెళ్లిరాట మహోత్సవం



దిమిలి రామాలయంలో భక్తి గీతాలాపన చేస్తున్న చిన్నారులు



కోలాటమాడుతున్న మహిళలు



కొండకర్లలో సీతారాముల పెళ్లిరాట మహోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఎస్.రాయవరం : మండలంలోని రామాలయాల్లో శ్రీరామ నవమి ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. తిమ్మాపురం, ఎస్.రాయవరం, దార్లపూడి తదితర గ్రామాల్లో రామాలయాల వద్ద చలువ పందిళ్లు వేశారు. గురువారం సీతారాముల కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పలుగ్రామాల్లో భారీ అన్న సమారాధన చేయనున్నారు.

కోటవురట్ల : శ్రీరామనవమి వేడుకలకు రామాలయాలు సిద్ధమయ్యాయి. సీతారాముల కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించేందుకు ఆలయ ప్రతినిధులు సకల ఏర్పాట్లు చేశారు. రామాలయాల ముందు చలువ పందిళ్లు వెలిశాయి. మామిడి తోరణాలు, పూల దండలతో రామాలయాలను ముస్తాబు చేశారు. రాములోరి కల్యాణాన్ని వేద పండితులతో శాస్త్రోక్తంగా నిర్వహించేందు సర్వం సిద్ధం చేశారు. కోటవురట్ల, కైలాసపట్నం, పాములవాక, కె.వెంకటాపురం, బి.కె.పల్లి తదితర గ్రామాలలో వేడుకలకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.



ముస్తాబైన తిమ్మాపురం రామాలయం

ప్లాస్టిక్ నిషేధంతోనే పర్యావరణ పరిరక్షణ

మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి



మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

యలమంచిలి : ప్లాస్టిక్ నియంత్రణ ద్వారానే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి అన్నారు. బుధవారం యలమంచిలి పట్టణంలో ప్రభుత్వాదేశాలు మేరకు స్వచ్ఛతపై మున్సిపల్, మెప్మా అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, వాలంటర్లు, శానిటేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీగా వెళ్లి, వైయస్సార్ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడి స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యకర జీవన విధానం క్షీణిస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధంపై దృష్టిసారించాలన్నారు. ఇంటిలో వాడిన వ్యర్థాలతో హోమ్ కంపోస్ట్ తయారు చేసుకోవాలన్నారు. తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేరు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్తా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, మెప్మా సిబ్బంది, వలంటీర్లు, కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

ఫస్టియర్ విద్యార్థులకు 22 వరకు ప్రత్యేక తరగతులు



పరీక్షా కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

యలమంచిలి : ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. యలమంచిలి పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొక్కిరాపల్లి గురుకుల బాలికల కళాశాలలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో చివరి రోజు ద్వితీయ సంవత్సర పరీక్షకు 931 మంది విద్యార్థులకుగాను 890 మంది హాజరు కాగా, 41మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్‌లు సరోజని, కృష్ణతారలు తెలిపారు. గత రెండు వారాలుగా సీసీ కెమెరాల నిఘాలో, పోలీసుల పర్యవేక్షణలో కట్టుదిట్టంగా పరీక్షలు జరిగాయి. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశారు. పరీక్షలు ముగియడంతో గురుకుల పాఠశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తమ సొంత ఊళ్లకు పయనమయ్యారు. ప్రభుత్వాదేశాలు మేరకు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఏప్రిల్ 22వ వరకు ఆంగ్ల భాష, ద్వితీయ సంవత్సర సబ్జెక్టుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు కొక్కిరాపల్లి గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.వి.కృష్ణతార తెలిపారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



పంచదార్ల గ్రామంలో చిరుధాన్యాలపై అవగాహన ర్యాలీ

రాంబిల్లి : చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని టాటా ట్రస్టు–విజయవాహిని చారిటబుల్ ట్రస్టు పోషణ్ పక్వాడా కార్యక్రమ కోఆర్డినేటర్ అరుణ అన్నారు. పంచదార్ల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిరుధాన్యాల ప్రాధాన్యతపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు . తొలుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలు తినడం ద్వారా ఐరన్, కాల్షియం, ప్రోటీన్లు సమృద్ధిగా లభిస్తాయన్నారు. చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాల పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు అమ్మాజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజు, చిన్నారావు, పోషణ్ సఖి కిల్లాడ దేవి, అంగన్‌వాడీ టీచర్ సంతోషి పాల్గొన్నారు.

టీ దుకాణంలో అగ్ని ప్రమాదం

యలమంచిలి : టీ దుకాణంలో వంట గ్యాస్ లీకై మంటలు వ్యాపించడంతో సుమారు రూ.లక్ష ఆస్తినష్టం సంభవించింది. అగ్నిమాపక శాఖ సీఐ రాంబాబు తెలిపిన వివరాలు. మండలంలోని పోతిరెడ్డిపాలెం హైవే కూడలి వద్ద ఉన్న టీ ట్రీ దుకాణంలో మంగళవారం అర్ధరాత్రి వంట గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. స్థానికుల సమాచారంతో ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. టీ షాపు నిర్వాహకుడు కల్లా కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

'విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి'



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ అప్పలరాజు

పాయకరావుపేట : ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో బాగా చదువుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని సీఐ పి.అప్పలరాజు అభిలషించారు. మండలంలోని పాల్తేరు గ్రామ క్రీడాస్థలంలో విద్యార్థులతో ఆయన మాట్లాడారు. యువత మానసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. చెడు అలవాట్లకు, వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవుపలికారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులంతా ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



విద్యార్థులకు దుస్తులు అందిస్తున్న దృశ్యం

నక్కపల్లి : మండలంలోని డీఎల్ పురం పాఠశాలలో పనిచేస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయుడు ఏడిద వెంకటరమణ బుధవారం తన సొంత నిధులతో 3, 4, 5 తరగతుల విద్యార్థులకు దుస్తులు, ఆయాలకు దుప్పట్లు పంపిణీ చేసారు. ప్రధానోపాధ్యాయుడు వేమగిరి నూకరాజు, పాఠశాల కమిటీ చైర్మన్ ప్రసాదు సమక్షంలో వీటిని అందించారు.

ఆలయ రథ నిర్మాణానికి విరాళం



రథం నిర్మాణానికి రూ.50 వేలు విరాళం అందిస్తున్న గోగుల కుటుంబం

మునగపాక : మునగపాకలోని పంచాయతీ దరి పురాతన సీతారాముల ఆలయ రథం నిర్మాణానికి ఆలయ ధర్మకర్త గోగుల సీతారత్నం కుటుంబ సభ్యులు రూ.50 వేలు విరాళం ఇచ్చారు. ఈ నగదును ఆలయ నిర్వాహకులకు బుధవారం రాత్రి అందించారు. కార్యక్రమంలో ఆడారి లక్ష్మణరావు, ఆడారి అచ్చియ్యనాయుడు, జల్లేపల్లి కిష్టప్ప, మళ్ల జోగారావు, పొలిమేర కృష్ణ, ప్రసాద్, గోవింద, మాధవ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఆర్బీకేలను సందర్శించిన ఏడీఏ



నష్టపోయిన నువ్వు పంటను పరిశీలిస్తున్న ఏడీఏ రవి ప్రకాష్, వ్యవసాయ సిబ్బంది

అచ్యుతాపురం(అనకాపల్లి) : కిసాన్ ఈ కేవైసీని త్వరితగతిన పూర్తి చేసేందుకు రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)ల్లోని వ్యవసాయ సిబ్బంది కృషి చేయాలని యలమంచిలి సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఆర్.రవిప్రకాష్ సూచించారు. బుధవారం ఆయన అచ్యుతాపురం మండలంలోని చోడపల్లి, హరిపాలెం, జగ్గన్నపేట రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. ఇటీవల కురిసిన వర్షాలకు జగ్గన్నపేట, ఖాజీపాలెం పరిసరాలోల దెబ్బతిన్న నువ్వు పంటలను ఆయన పరిశీలించారు. నష్టపోయిన రైతులు, ఆయా పంటల వివరాలను నమోదు చేయాలని వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచించారు. ఏవో శంకర్ గోవింద్, విస్తరణాధికారి సూర్యనారాయణ, ఏఈవో దేవుడు, సర్పంచ్ దొడ్డి కృష్ణ వెంకటలక్ష్మి, రైతులు మళ్ల భాస్కరరావు, దొడ్డి దుర్గినాయుడు, మళ్ల ఆదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయం



మాట్లాడుతున్న సంపద తయారీ కేంద్రాల నిర్వహణ జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి

మునగపాక : సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి అన్నారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణపై దృష్టి సారించాలన్నారు. మునగపాక సంపద తయారీ కేంద్రంలో తొలివిడత నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. కార్యక్రమానికి అతిథిగా హాజరైన నాగలక్ష్మి మాట్లాడుతూ పారిశుధ్యం, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగునకు పాటుపడాలన్నారు. అలాగే జగనన్న స్వచ్ఛ సంకల్పం శతశాతం అమలు జరిగేలా చూడాలన్నారు. వర్మీ కంపోస్టు ఎరువుల తయారీకి మరింత పాటుపడాలన్నారు. ఆహ్లాదకర వాతావరణంలో మునగపాకలో సంపద తయారీ కేంద్రం నిర్మాణానికి కృషి చేసిన సర్పంచ్ దిమ్మల అప్పారావును అభినందించారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, ఎంపీడీవో రవికుమార్, ఈవోఆర్డీ ఈశ్వరరావు, సర్పంచ్‌లు కారుకొండ వెంకటి, సూరిశెట్టి గంగయమ్మ(ఎస్ఆర్), ఉప సర్పంచ్ పెంటకోట సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి శ్రీకారం



తిమ్మరాజుపేట శ్మశానవాటిక అభివృద్ధికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ మంగలక్ష్మి

మునగపాక : తిమ్మరాజుపేట గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కోరారు. స్థానిక శ్మశానవాటిక అభివృద్ధికి పనులకు బుధవారం ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్మశానం అభివృద్ధికి జెడ్పీటీసీ రూ.5 లక్షలు, ఎంపీటీసీ రూ.2.50 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. గ్రామంలో సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, వైఎస్సార్‌సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు ఆడారి గణేష్, వార్డు సభ్యులు శరగడం గౌరీశ్వరరావు, కాండ్రేగుల జగన్‌మోహన్‌రావు, మల్ల అప్పలనాయుడు, శరగడం సత్తిబాబు, పీఏసీ చైర్మన్ కర్రి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల రద్దీని క్రమబద్ధీకరించండి



ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్‌కు వినతిపత్రం అందిస్తున్న అఖిలపక్షం నేతలు

మునగపాక : పూడిమడక రోడ్డుపై పరిమితికి మించి వాహనాలు రాకుండా నిరోధించాలని కోరుతూ అఖిలపక్షం ఆధ్వర్యంలో ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్‌కు బుధవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘ అధ్యక్షుడు ఆడారి మహేష్ మాట్లాడుతూ పూడిమడక రోడ్డుపై పరిమితికి మించి వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. తక్షణమే అధిక లోడుతో వచ్చే వాహనాలను నియంత్రించాల్సిందిగా కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఆడారి మంజు, దాడి ముసిలినాయుడు, భీమరశెట్టి శ్రీనివాసరావు, దొడ్డి శ్రీనివాసరావు, మళ్ల రాజేష్, మొల్లేటి సత్యనారాయణ, ఏపీఎం సత్యనారాయణ, వెలగా మురళి, ఆడారి గోవింద, ప్రసాద్ తదితరులున్నారు.

ఉపాధి హామీ పథకంతో గ్రామాల అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ రాజా

మునగపాక : ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు జరిగేలా చూడాలని స్టేట్ రిసోర్స్ పర్సన్(సీఆర్‌పీ) రాజా సూచించారు. స్థానిక మండల పరిషత్ హాల్లో బుధవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పనిచేసే వారికి సకాలంలో వేతనాలు అందించాలన్నారు. ఈ పథకంలో భాగంగా రహదారులు, డ్రైనేజీలు, చెరువులు, కాలువలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో రవికుమార్, ఏపీవో ఎరకయ్య, ఈవో ఆర్డీ ఈశ్వరరావు, మండల ఇంజినీరింగ్ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర భూ సర్వేతో సమస్యలకు చెక్



చినగుమ్ములూరు గ్రామంలో రీసర్వే పనులు పరిశీలిస్తున్న ఆర్డీవో జయరాం

ఎస్.రాయవరం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూసర్వే కార్యక్రమం మరింత వేగవంతంగా జరగాలని నర్సీపట్నం ఆర్డీవో జయరాం సంబంధిత అధికారులను ఆదేశించారు. చినగుమ్ములూరులో జరుగుతున్న సర్వే పనులను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పనుల స్పీడ్ పెంచాలన్నారు. కేటాయించిన సిబ్బంది సకాలంలో హాజరు కావాలని హెచ్చరించారు. రైతులకు ముందుగా సమాచారం అందించి, వారి సమక్షంలోనే సాధ్యమైన మేరకు సర్వే జరిగేలా చూడాలన్నారు. ఈ సర్వే పూర్తయితే దీర్ఘకాలికంగా ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. కొందరు ఆక్రమణదారులు కావాలనే అభ్యంతరాలు లేవనెత్తుతారని, వారికి నచ్చజెప్పి సర్వే కొనసాగించాలన్నారు. పరిశీలనలో ఆర్డీవో వెంట తహసీల్దార్ శ్యామ్‌కుమార్, డీటీ నారాయణరావు, మండల సర్వేయర్ త్రిమూర్తులు పాల్గొన్నారు.